సాక్షి
అనంతపురం
శుక్రవారం । 21 । ఏప్రిల్ । 2023



రెచ్చిపోయిన చైన్‌స్నాచర్లు

జిల్లాలో గురువారం పలు చోట్ల చైన్‌స్నాచర్లు రెచ్చిపోయారు. మహిళల మెడలో గొలుసులను లాక్కెళ్లిపోయారు. 8లో



టన్ను చీనీ రూ.35 వేలు

స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్ట ధర రూ.35 వేల ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
43.2°/22.6°

భానుడి భగభగలతో వేసవి తాపం కొనసాగుతోంది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగానూ రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో తూర్పు దిశగా గాలి వీచింది.



ఈత.. కారాదు కడుపుకోత

- పెరుగుతున్న నీటి ప్రమాదాలు
- తల్లిదండ్రులనూ దుఃఖంలోకి నెడుతున్న పిల్లలు
- పర్యవేక్షణ పెరగాలంటున్న నిపుణులు


అనంతపురం సమీపంలో కాలువలో ఈత కొడుతున్న పిల్లలు (ఫైల్)

- గుమ్మఘట్ట మండలం భూపసముద్రం గ్రామానికి చెందిన గణేష్ (14) ఈ నెల 6న వేదావతి నదికి వెళ్లాడు. సరదాగా ఈత కొడుతూ మడుగు మధ్యలోకి వెళ్లి విలవిలలాడుతూ మునిగిపోయాడు. వెంటవెళ్లిన మిత్రులు కేకలు వేయడంతో స్థానికులు కొందరు అక్కడికి చేరుకుని వెలికితీయగా.. అప్పటికే బాలుడు మృతి చెందాడు.
- బ్రహ్మసముద్రం మండలం భైరవానితిప్ప గ్రామానికి చెందిన వడ్డే పునీత్ (7) ఈ నెల 16న పోలేపల్లిలోని మేనమామ ఇంటికి వచ్చాడు. గ్రామ సమీపాన బీటీ ప్రాజెక్ట్ నుంచి ఆయకట్టు పొలాలకు నీటిని చేర్చే ప్రధాన కుడి కాలవలో ఈతకు దిగి నీట మునిగాడు. ఊపిరాడక మృతి చెందాడు.

.... ఇలాంటి ఘటనలు జిల్లాలో కొన్ని రోజులుగా నిత్యం ఎక్కడో ఒక చోట జరుగుతూనే ఉన్నాయి.

రాయదుర్గం: గడచిన మూడేళ్లు జిల్లాలో వానలు భారీగా పడ్డాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. వరుణ దేవుడి కరుణతో చెరువులు, కాలువలు నీటితో తొణికిసలాడుతున్నాయి.

మింగేస్తున్న గుంతలు..

టీడీపీ హయాంలో విచ్చలవిడిగా ఇసుక దోపిడీ జరగడంతో కాలువలు, చెరువుల్లో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. కొన్నాళ్ల క్రితం కురిసిన వర్షాలతో వాటిల్లోకి భారీగా నీరు చేరాయి. వేసవి సెలవుల నేపథ్యంలో ఈత కొట్టేందుకు ఆయా ప్రాంతాలకు వెళ్తున్న పిల్లలు లోతు గమనించక నీట మునిగి ప్రాణాలు కోల్పోతున్నారు.

తల్లిదండ్రులూ ఓ కన్నేయండి ..

ఎండల తీవ్రత దృష్ట్యా ప్రస్తుతం ఒంటిపూట బడులు నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం 12:30 తర్వాత ఇళ్లకు చేరుతున్న విద్యార్థులు భోజనం చేశాక తోటి పిల్లలతో కలిసి ఈత కోసం వెళ్తూ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పిల్లలపై తల్లిదండ్రులు ఓ కంట కనిపెట్టుకుని ఉండాలని అధికారులు, పోలీసులు సూచిస్తున్నారు. పిల్లలు బయటకు వెళ్తే తప్పకుండా సమాచారం ఇచ్చి వెళ్లేలా అవగాహన కల్పించాలని చెబుతున్నారు. పర్యవేక్షణ లేకుండా ఈతకు అనుమతించరాదని సూచిస్తున్నారు. చాన్నాళ్లుగా నీరు లేక ఒట్టిపోవడానికి తోడు గతంలో విచ్చలవిడిగా జరిగిన ఇసుక దోపిడీతో ఎక్కడ లోతు ఉంటుందో అవగాహనకు రావడం కష్టమని, కాలువలు, చెరువుల వద్దకు ఎట్టి పరిస్థితుల్లో పంపకపోవడమే మంచిదని సూచిస్తున్నారు.

ఇంట్లోనే ఉండేలా చూసుకోవాలి



సెలవుల నేపథ్యంలో పిల్లల పట్ల తల్లిదండ్రులు ఓ కంట కనిపెట్టుకుని ఉండాలి. పాఠశాల నుంచి ఇంటికి చేరుకోగానే బయటకు పంపకుండా ఎక్కువసేపు ఇంట్లో గడిపేలా చూడాలి. ఖాళీ సమయాల్లో పుస్తకాలతోనే స్నేహం పెరిగేలా చేయడం ఉత్తమం.

– నిషాంత్‌రెడ్డి, ఆర్డీఓ, కళ్యాణదుర్గం

ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దు..



చెరువులు, బావుల వద్ద ప్రమాద సూచికలు తెలిపే హెచ్చరిక బోర్డులను సర్పంచులు ఏర్పాటు చేయాలి. ఈత సరదాతో పిల్లలు గంటల తరబడి నీళ్ల దగ్గరే ఆడుతూ ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ పెరగాలి. వేసవి శిబిరాలకు పంపితే మరీ మంచిది.

– శ్రీనివాసులు, డీఎస్పీ, కళ్యాణదుర్గం

ఈతకు వెళ్లి యువకుడి దుర్మరణం


మృతిచెందిన పవన్ (ఫైల్)

గుమ్మఘట్ట: మండలంలోని గలగల గ్రామానికి చెందిన బోయ పవన్ (21) అనే యువకుడు ఈతకు వెళ్లి దుర్మరణం పాలయ్యాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన బోయ వన్నూరుస్వామి, లక్ష్మీదేవి దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. వ్యవసాయ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. పవన్ రాయదుర్గంలోని ఓ గార్మెంట్‌లో జీన్స్ ప్యాంట్లు కుట్టడానికి వెళ్లేవాడు. 15 రోజులుగా పనులు లేక ఇంటి వద్దనే ఉంటున్నాడు. గురువారం స్నేహితులు గ్రామానికి సమీపంలో ఓ బావిలో ఈతకు వెళ్తుంటే వారితో కలిసి వెళ్లాడు. స్నేహితులు ఈతకు దిగగానే తనకు ఈత రాకపోయినా బావిలోకి ఒక్కసారిగా దూకాడు. నీటిలో మునిగిపోయాడు. సమాచారంతో గ్రామస్తులు అక్కడికి చేరుకుని ఎంతసేపు గాలించినా లభ్యం కాకపోవడంతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి మధ్యాహ్నం ఘటనా స్థలికి చేరుకుని బావిలో నీటిని బయటకు తోడేందుకు కర్ణాటక నుంచి నాలుగు మోటార్లను ఏర్పాటు చేయించారు. అగ్నిమాపక సిబ్బందికి చేరుకుని నవీన్ మృతదేహాన్ని బయటకు తీశారు. కుటుంబానికి అండగా ఉంటున్న కుమారుడు తిరిగి రాని లోకాలకు వెళ్లి పోవడంతో కుటుంబసభ్యుల ఆర్తనాదాలు మిన్నంటాయి. విప్ కాపు మృతదేహానికి నివాళులర్పించి, తల్లిదండ్రులను ఓదార్చారు. సర్పంచ్ హేమక్క, జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ మహేష్, బేలోడు సర్పంచ్ కోట్ల ఉమేష్, కె.పి.దొడ్డి సర్పంచ్ రమేష్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మంజునాథ సంతాపం తెలిపారు.

జాగ్రత్తలు పాటించండి

- వేసవి దృష్ట్యా ప్రజలకు కలెక్టర్ సూచనలు

అనంతపురం అర్బన్: ఎండలు మండుతున్న నేపథ్యంలో జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ ఎం.గౌతమి జిల్లా ప్రజలకు సూచించారు. ఈ మేరకు గురువారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. మధ్యాహ్నం వేళ 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోందని, వీలైనంత వరకూ ఉదయం, సాయంత్రం వేళల్లోనే బయటకు రావాలని తెలిపారు. అధికారులు తీసుకోవాల్సిన చర్యలనూ పేర్కొన్నారు.

ఆదేశాలు ఇలా..

- మునిసిపల్, పంచాయతీ అధికారులు జన సంచారం అధికంగా ఉండే ప్రాంతాలు, కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి. పట్టణాల్లో అక్కడక్కడా చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలి.
- డ్వామా, ఎంపీడీఓలు ఉపాధి హామీ పనుల వేళల్లో మార్పులు చేసుకోవాలి.
- 104, 108 అంబులెన్స్‌ల్లో ఐస్‌ప్యాక్‌లు, వడదెబ్బ తగిలిన వారికి అనవసరమయ్యే మందులు అందుబాటులో ఉంచాలి.
- వడదెబ్బ బాధితులకు చికిత్స అందించేందుకు కావాల్సిన ఏర్పాట్లు ఆరోగ్య కేంద్రాల్లో ఉంచాలి. ప్రజలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలి.
- వడదెబ్బ తగిలిన వారికి అందించే ప్రాథమిక చికిత్సపై విస్తృత ప్రచారం నిర్వహించాలి.
- అగ్నిమాపక శాఖ అప్రమత్తంగా ఉండాలి. సిబ్బంది, నీటిని అందుబాటులో ఉంచుకోవాలి.
- సూదూర రూట్లలో నడిచే బస్సుల్లో తప్పసరిగా ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఆర్టీసీ అధికారులు అందుబాటులో ఉంచాలి.

23న రజాపురం గురుకులం రాత పరీక్ష

గుత్తి రూరల్: మండలంలోని రజాపురం డాక్టర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం, ఐదో తరగతిలో ప్రవేశానికి ఈ నెల 23న రాత పరీక్ష ఉంటుందని ప్రిన్సిపాల్ ఉషారాణి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతి ప్రవేశానికి ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకూ, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకూ పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు హాల్ టికెట్, ఆధార్ కార్డు జిరాక్స్, బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్నుతో గంట ముందు హాజరు కావాలన్నారు. http://apgpcet.apcfss.in, http:// లేదా apgpcet.apcfss.in/inter సైట్‌ల ద్వారా హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

న్యూస్‌రీల్

చిరుతల హల్‌చల్


గోశాలను పరిశీలిస్తున్న ఫారెస్ట్ అధికారులు

కళ్యాణదుర్గం: పట్టణ సమీపంలోని వెంగమాంబ గోశాలలో బుధవారం అర్ధరాత్రి చిరుతలు హల్‌చల్ చేశాయి. గోశాలలోని పశువులపై దాడికి యత్నించాయి. గమనించిన గోశాల సంరక్షకులు కేకలు వేయడంతో గస్తీ నిర్వహిస్తున్న పట్టణ పోలీసులు అక్కడికి వచ్చారు. అందరూ కలిసి కేకలు వేయడంతో ఆవులకు హాని తలపెట్టకుండానే చిరుతలు వెనుదిరిగాయి. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ షాన్‌వాజ్ సిబ్బందితో కలిసి గురువారం గోశాలను పరిశీలించారు. చుట్టూ కంచె ఉన్నా చిరుతలు లోపలికి వస్తున్నాయని నిర్వాహకులు అధికారుల వద్ద వాపోయారు. పలుమార్లు ఆవులపై దాడి చేసి చంపేశాయని ఈ నెలలోనే మూడు సార్లు మూగజీవాలపై దాడి చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు.

మొక్కజొన్నకు 'మద్దతు'



అనంతపురం అగ్రికల్చర్: రబీలో రైతులు పండించిన మొక్కజొన్నకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) ఇచ్చి కొనుగోలు చేస్తామని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పెన్నేశ్వరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఈసారి ఎక్కువ విస్తీర్ణంలో మొక్కజొన్న సాగులోకి వచ్చిందన్నారు. అందుకు అనుగుణంగా నాణ్యమైన మొక్కజొన్న క్వింటా రూ.1,962 ప్రకారం కొనుగోలు చేసి మూడు వారాల్లో రైతుల ఖాతాల్లోకి సొమ్ము జమ చేస్తామన్నారు. మొక్కజొన్న పండించిన రైతులు ఆర్బీకేల్లో ఈనెల 24 నుంచి రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని సూచించారు.

నెలాఖరు వరకు పప్పుశనగ కొనుగోళ్లు

నెల రోజులుగా రబీ పప్పుశనగ క్వింటా రూ.5,335 ప్రకారం కొనుగోలు చేస్తున్నట్లు పెన్నేశ్వరి వెల్లడించారు. ఇప్పటి వరకు 1,727 మంది రైతుల నుంచి 3,808 మెట్రిక్ టన్నుల పంట కొనుగోలు చేశామన్నారు. అందులో 1,399 మంది రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేయడం పూర్తయిందని పేర్కొన్నారు. పప్పుశనగ కొనుగోలు కేంద్రాలు ఈనెలాఖరు వరకు పనిచేస్తాయన్నారు.

ఫలితాల విడుదల


జేఎన్‌టీయూ పరీక్షల భవనం

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ) పరిధిలో నిర్వహించిన ఎమ్మెస్సీ నాలుగో సెమిస్టర్ (ఆర్–20) రెగ్యులర్, ఎంబీఏ ఒకటో సెమిస్టర్ (ఆర్–21) రెగ్యులర్, సప్లిమెంటరీ, ఎంసీఏ (ఒకటో సెమిస్టర్–ఆర్–17, ఆర్–20) సప్లిమెంటరీ, ప్రీ పీహెచ్‌డీ (వింటర్ సెషన్) పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ కేశవ రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ చంద్రమోహన్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

పచ్చని పల్లెలో 'కాలవ' చిచ్చు


పోలీసులపైకి టీడీపీ కార్యకర్తలను ఉసిగొల్పుతున్న కాలవ శ్రీనివాసులు


విప్ కాపు రామచంద్రారెడ్డిని అడ్డుకుంటున్న పోలీసులు

రాయదుర్గం: ఉనికి చాటుకునేందుకు నానా తంటాలు పడుతున్న టీడీపీ నేత కాలవ శ్రీనివాసులు తన ప్రాపకం కోసం పచ్చని పల్లెల్లో సైతం చిచ్చు రేపేందుకు యత్నించారు. ప్రశాంతతకు మారుపేరుగా ఉన్న ఓ గ్రామంలో పచ్చ మూకలతో కలిసి నానా హంగామా చేశాడు. వివరాలు.. కణేకల్లు మండలం ఎన్ హనుమాపురంలో రెండు రోజుల క్రితం ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని ఇంటింటా వివరించారు. టీడీపీ హయాంలో జరిగిన దోపిడీని ఎండగడుతూనే.. ఎవరి హయాంలో ప్రజలకు ఎంత మేలు జరిగిందో ఇంటింటా చర్చించేందుకు రావాలని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులుకు సవాల్ విసిరారు. గురువారం సాయంత్రం 4 గంటలకు మళ్లీ 'గడప గడపకూ మన ప్రభుత్వం' నిర్వహిస్తానని, గ్రామం రావాలని సూచించారు.

దొడ్డిదారిన వచ్చి.. పచ్చమూకల్ని పోగేసి..

ఇంటింటా చర్చిస్తే ఎక్కడ తమ బాగోతం బయట పడుతుందని భావించిన కాలవ శ్రీనివాసులు మధ్యాహ్నం ఒంటి గంటకే హనుమాపురం చేరుకుని సర్పంచ్ జయరామ్‌చౌదరి ఇంట్లో చేరారు. టీడీపీ మూకలు, ఎల్లో మీడియాను పోగుచేశారు. ఆ తర్వాత ఎస్.హనుమాపురానికి వస్తున్నట్టు సామాజిక మాధ్యమాల ద్వారా వైరల్ చేసి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు కళ్యాణదుర్గం డీఎస్పీ బి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో భారీగా గ్రామంలో మోహరించారు.

పోలీసులపై దౌర్జన్యం..

'కాలవ' స్థావరాన్ని గుర్తించిన పోలీసులు అక్కడికి వెళ్లగా.. వారిపైనే పచ్చ మూకలతో కలిసి దౌర్జన్యం చేశారు. దాడికి యత్నించారు. ముందుగానే కాలువ చెప్పినట్లుగా పచ్చనాయకులు ఈలలు, కేకలేస్తూ రణరంగం సృష్టించారు. నాటకీయ పరిణామల మధ్య ఎట్టకేటలకు కాలవను పోలీసులు అరెస్టు చేసి కళ్యాణదుర్గం పట్టణ పీఎస్‌కు తరలించారు. గ్రామంలో 144 సెక్షన్, పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్టు డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు.

ఉద్దేహాళ్ వద్ద విప్ అడ్డగింత..

ఈ క్రమంలోనే గడప గడపకూ మన ప్రభుత్వం చేపట్టేందుకు ఎన్. హనుమాపురం వెళుతున్న విప్ కాపును బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్ వద్ద రూరల్ సీఐ యుగంధర్, ఎస్ఐ శివ అడ్డగించారు. అధికారం ఉన్నా, లేకపోయినా తమకే ఎక్కువ ఆంక్షలు పెడతున్నారంటూ విప్ వారితో వాపోయారు. పోలీసులంటే తమకు గౌరవమని.. 'మీకు విలువిచ్చే వెళ్తాం, శుక్రవారం యథావిధిగా కార్యక్రమం చేపడతామ'ని తెలిపారు.

అల్లరి చేసేందుకే వచ్చారు

రాయదుర్గం: కణేకల్లు మండలం ఎన్ హనుమాపురంలో ఇంటింటా టీడీపీ హయాంలో ఎన్ని పథకాలందాయి.. నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మేమెంత మేలు చేశామన్న దానిపై గడప గడపకూ వెళ్లి చర్చిద్దామని తాము కోరితే.. అల్లరి చేసేందుకే కాలవ శ్రీనివాసులు వచ్చారని విప్ కాపు రామచంద్రారెడ్డి విమర్శించారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కాలవ లాంటి వెదవను దేశంలోనే ఎక్కడా చూడలేదన్నారు. వెదవలకు పదవులివ్వకూడదనే ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. చేతకాని దద్దమ్మలా లేనిపోని హంగామా సృష్టిస్తావా అంటూ కాలవపై మండిపడ్డారు. 'ఇంకోసారి సూటిగా కోరుతున్నా.. నీకు దమ్ము ధైర్యం ఇంటింటికీ నాతో కలసి రా..?' అంటూ హితవు పలికారు. పచ్చ మూకల రౌడీయిజం, గుండాయిజం చూసి ఎస్.హనుమాపురం ప్రజలు అసహ్యించుకున్నారన్నారు. కాలవేంటో, ఆయన బతుకేంటో ప్రజలకు చెప్పాల్సిన పనిలేదన్నారు. 2019 కంటే ఘోరంగా 2024 ఎన్నికల్లోనూ ప్రజలు ఆయనను చిత్తుచిత్తుగా ఓడిస్తారని జోస్యం చెప్పారు. బుద్ధిగా ఉండకపోతే, నీకన్నా ఎక్కువే బరితెగిస్తామని హెచ్చరించారు.

ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లండి

- పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్


అలసంద పంటను పరిశీలిస్తున్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్, కలెక్టర్ గౌతమి

కళ్యాణదుర్గం: రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ విజ్ఞప్తి చేశారు. గురువారం కళ్యాణదుర్గం మండల పరిధిలోని మల్లాపురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేస్తున్న పంట పొలాలను కలెక్టర్ గౌతమి, ఏటీఎం మోడల్ రూపకర్త, ఏపీసీఎస్ఎఫ్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయ్‌కుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా సంఘాలను అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములను చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. రైతే రాజు అన్న నినాదాన్ని ప్రకృతి వ్యవసాయం నిజం చేస్తుందన్నారు. కలెక్టర్ ఎం. గౌతమి మాట్లాడుతూ పొలాల్లోకి దిగిన ప్రతిసారీ ఆదాయం పొందే విధంగా 'ఏటీఎం మోడల్'ను అవలంబించాలని ఆకాంక్షించారు. ఈ విధానం రైతులకు లాభసాటిగా ఉండటంతో పాటు నాణ్యమైన ఆహార పదార్థాలను వినియోగదారులకు అందించేందుకు దోహదపడుతుందన్నారు. అతి తక్కువ పెట్టుబడితో, తక్కువ విస్తీర్ణంలో, రసాయనాలు అవసరం లేకుండా వివిధ రకాల పంటలు ఏకకాలంలో పండిస్తూ సొమ్ము చేసుకుంటున్న రైతులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఏటీఎం మోడల్‌పై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఏపీసీఎస్ఎఫ్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్ సూచించారు. అనంతరం పలువురు రైతులు సాగు చేసిన చిరుధాన్యాల పంటలను వారు పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీఓ నిశాంత్‌రెడ్డి, డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ తదితరులు పాల్గొన్నారు.

26న జెడ్పీ సర్వసభ్య సమావేశం

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 26న నిర్వహించనున్నట్లు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ గురువారం తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి మంత్రి ఉషశ్రీచరణ్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీ, కో–ఆప్షన్ సభ్యులు, ఎంపీపీలు, రెండు జిల్లాల కలెక్టర్లు హాజరు కానున్నట్లు వివరించారు. 2023–24 బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. వేసవిలో తాగునీటితో పాటు ఇతర ముఖ్యమైన అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. గత సమావేశాల్లో సభ్యులు అడిగిన అంశాలకు సంబంధించి తీసుకున్న చర్యలతో పాటు ఇప్పుడు జరగబోయే సమావేశంలో చర్చించనున్న అంశాలకు సంబంధించి సమాధానాలు చెప్పేలా సమగ్ర వివరాలతో అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఆదేశించారు. గైర్హాజరైతే చర్యలు తప్పవని తేల్చిచెప్పారు. ఇప్పటికే అజెండాతో పాటు సమాచారాన్ని తమ శాఖ అధికారులు చేరవేసినట్లు ఆమె తెలిపారు.

గడువులోగా మూల్యాంకనం పూర్తి చేయాలి

- ఆర్జేడీ ప్రతాపరెడ్డి


మూల్యాంకన కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్జేడీ ప్రతాప రెడ్డి, చిత్రంలో డీఈఓ సాయిరామ్

రాప్తాడురూరల్: పదోతరగతి జవాబు పత్రాల మూల్యాంకనం గడువులోగా పూర్తి చేయాలని ప్రాథమిక విద్యాశాఖ ఆర్జేడీ ప్రతాపరెడ్డి ఆదేశించారు. అనంతపురం కేఎస్ఆర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న మూల్యాంకన ప్రక్రియను గురువారం ఆయన పరిశీలించారు. ముందుగా విద్యాశాఖ అధికారి, క్యాంపు అధికారి సాయిరామ్, డిప్యూటీ క్యాంపు ఆఫీసర్లు శంకర ప్రసాద్, గోవిందునాయక్, ఏసీఓలతో సమీక్షించారు. జిల్లాకు ఎన్ని జవాబుపత్రాలు వచ్చాయి, దిద్దేందుకు ఆశించిన స్థాయిలో ఏఈలను నియమించారా? ఇంకా ఏ సబ్జెక్టుకైనా అవసరమా? అని తెలుసుకున్నారు. సరిపడా స్థాయిలో అందరూ అందుబాటులో ఉన్నారని డీఈఓ వివరించారు. తొలిరోజు తక్కువగా ఉన్నా రెండో రోజు అందరినీ సర్దుబాటు చేశామన్నారు. అనంతరం ఆర్జేడీ మూల్యాంకన కేంద్రాల్లోకి వెళ్లి పరిశీలించారు. పేపర్లను జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. మార్కుల టోటలింగ్‌ను ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకోవాలన్నారు. ఏ చిన్న పొరబాటు చేసినా విద్యార్థులపై ప్రభావం పడుతుందనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆర్జేడీ.. వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని చల్లని నీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. మరుగు దొడ్లు తరచూ శుభ్రం చేయించాలని ఆదేశించారు.

త్వరలోనే 98 డీఎస్సీ టీచర్లకు శిక్షణ

ఇటీవల ఎంటీఎస్ పద్ధతిలో నియామకం పొందిన 98–డీఎస్సీ టీచర్లకు త్వరలో శిక్షణ ఏర్పాటు చేసేలా ప్రభుత్వం ఆలోచిస్తోందని ఆర్జేడీ తెలిపారు. బోధన పద్ధతులు, ఇతర అంశాలపై వేసవి సెలవుల్లోనే శిక్షణ ఉంటుందన్నారు.

రెమ్యూనరేషన్ పెంపు

పదో తరగతి జవాబుపత్రాల మూల్యాంకనం విధుల్లో పాల్గొనే సిబ్బందికి రెమ్యూనరేషన్ పెరిగింది. దాదాపు పదేళ్ల తర్వాత ప్రభుత్వం రెమ్యూనరేషన్ పెంచుతూ జీఓ విడుదల చేయడంతో సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. అసిస్టెంట్ ఎగ్జామినర్లకు గతంలో ఒక పేపరుకు రూ. 6.60 చెల్లించేవారు. ఇప్పుడు రూ.10కు పెంచారు. క్యాంపు అధికారికి రూ. 385 ఇస్తుండగా– రూ. 578కి, డిప్యూటీ క్యాంపు అధికారుల (స్ట్రాంగ్‌రూం, అడ్మిన్)కు గతంలో రూ. 330 ఇస్తుండగా– రూ. 495కు, అసిస్టెంట్ క్యాంపు అధికారికి రూ. 286 ఇస్తుండగా– రూ. 429కు, చీఫ్ ఎగ్జామినర్‌కు రూ. 264 ఇస్తుండగా– రూ. 396కు, స్పెషల్ అసిస్టెంట్లకు రూ. 137.50 ఇస్తుండగా రూ. 300, క్లరికల్ అసిస్టెంట్‌కు రూ.88 ఇస్తుండగా రూ.132, ఆఫీస్ సబార్డినేటర్లకు రూ.55 ఇస్తుండగా– రూ. 83కు, చీఫ్ కోడింగ్ అధికారికి రూ. 220 ఇస్తుండగా,రూ. 330కు, అసిస్టెంట్ కోడింగ్ అధికారికి రూ. 198 ఉండగా, రూ. 297కు పెంచారు.

ఎమ్మెల్సీలకు కృతజ్ఞతలు

ఎమ్మెల్సీలు కల్పలతారెడ్డి, రామచంద్రారెడ్డి వల్లే రెమ్యూనరేషన్ పెరిగిందని నాయకులు పేర్కొన్నారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, రజనీకాంత్ రెడ్డి, బాబయ్య, శ్రీరాములు, వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్‌కుమార్‌రెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి గోవిందరెడ్డి, నాయకులు నాగిరెడ్డి, రమణ, నాగేంద్రరెడ్డి గురువారం ఆర్జేడీ ప్రతాప్ రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపారు.

డిగ్రీ ఆనర్స్‌లో సమూల మార్పులు

- మూడేళ్ల పాటు ఆయా పాఠ్యాంశాలు చదివే వీలు
- నాల్గో ఏట మెయిన్ సబ్జెక్టులో రెండు సెమిస్టర్లు మాత్రమే
- బీఎస్సీ ఎంపీసీ కోర్సులు బీఎస్సీ (మేథ్స్ ఆనర్స్)గా పరిగణన



అనంతపురం: బీటెక్ కోర్సులకు దీటుగా డిగ్రీ కోర్సులను రాష్ట్ర ప్రభుత్వం తీర్చిదిద్దుతోంది. సంప్రదాయ డిగ్రీ కోర్సులకు ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి కోర్సు పూర్తి కాగానే కొలువులు దక్కేలా విద్యా ప్రణాళికకు రూపకల్పన చేసింది. నూతన జాతీయ విద్యావిధానం-2020 అమల్లోకి రాక ముందే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో డిగ్రీ కోర్సుల అభ్యసనలో సమూల ప్రక్షాళన చేసింది. దీని ఆధారంగానే నూతన విద్యా ప్రణాళిక రూపకల్పన చేశారు. సంప్రదాయ కోర్సులు చదివినా సులువుగా కొలువులు దక్కేలా పాఠ్యప్రణాళికను రూపొందించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థిలో నైపుణ్యాలు పెంపొందించేలా కృషి జరుగుతోంది. డిగ్రీ కోర్సుల్లో ఆరు నెలల ఇంటర్న్‌షిప్‌తో పాటు సమాజానికి దోహదపడే ప్రాజెక్టులు, నైపుణ్య శిక్షణ, ఆన్‌లైన్ తరగతులు తప్పనిసరి చేశారు. నూతన జాతీయ విద్యావిధానం కంటే ముందే డిగ్రీ ఆనర్స్ విధానం అమలు చేయడంతో 2023-24 విద్యా సంవత్సరంలో డిగ్రీ నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఆనర్స్ డిగ్రీ ప్రదానం చేస్తున్నారు. నాలుగు సంవత్సరాల డిగ్రీ చదివితే ఆనర్స్ డిగ్రీ పట్టా అందనుంది. మూడు సంవత్సరాల్లో డిగ్రీ చదవడానికి వీలుగా ఎగ్జిట్ విధానం అమలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో డిగ్రీ ఆనర్స్ విధివిధానాలు, మార్గదర్శకాలకు పటిష్ట రూపకల్పన జరిగింది.

ఫైనలియర్‌లో మెయిన్ సబ్జెక్ట్ మాత్రమే

బీటెక్ తరహాలోనే డిగ్రీ లోనూ నాలుగేళ్ల విద్యా ప్రణాళిక అమలవుతోంది. డిగ్రీ కోర్సులో మూడు సంవత్సరాలు ఆయా సబ్జెక్టులు చదువుతారు. డిగ్రీ నాలుగో సంవత్సరం పూర్తిగా ఒక మెయిన్ సబ్జెక్టు మాత్రమే చదవాల్సి ఉంటుంది. ఆ మెయిన్ సబ్జెక్టు పేరుతోనే ఆనర్స్ డిగ్రీ ప్రదానం చేస్తారు. బీఎస్సీ ఎంపీసీ కోర్సులో ప్రధానంగా మేథమేటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులు మూడు సంవత్సరాల చదువుతారు. నాలుగో సంవత్సరంలో విద్యార్థికి ఆసక్తి ఉన్న ఈ మూడు సబ్జెక్టుల్లో ఒక మెయిన్ సబ్జెక్టును ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. నాలుగో సంవత్సరం రెండు సెమిస్టర్లు ఎంపిక చేసుకున్న మెయిన్ సబ్జెక్టు నుంచే పూర్తి చేస్తారు. ఉదాహరణకు బీఎస్సీ ఎంపీసీ చదువుతున్న విద్యార్థి డిగ్రీ మూడు సంవత్సరాలు మేథమేటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులు చదువుతారు. డిగ్రీ నాలుగో సంవత్సరంలో మేథమేటిక్స్ చదివితే బీఎస్సీ(ఆనర్స్, మేథమేటిక్స్), ఫిజిక్స్ మెయిన్ సబ్జెక్టుగా చదివితే బీఎస్సీ(ఆనర్స్ ఫిజిక్స్), కెమిస్ట్రీ మెయిన్ సబ్జెక్టుగా చదివితే బీఎస్సీ (ఆనర్స్ కమిస్ట్రీ)డిగ్రీ ప్రదానం చేస్తారు. ఇదే తరహాలో బీఏ (హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్సెస్) కోర్సు అయితే డిగ్రీ మూడు సంవత్సరాలు ఈ మూడు సబ్జెక్టులు చదువుతారు. నాలుగో సంవత్సరంలో విద్యార్థికి నచ్చిన మెయిన్ సబ్జెక్టు ఒకటి ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. హిస్టరీ ఎంపిక చేసుకుంటే బీఏ(హిస్టరీ ఆనర్స్), ఎకనామిక్స్ ఎంపిక చేసుకుంటే బీఏ (ఎకనామిక్స్ ఆనర్స్), పొలిటికల్ సైన్సెస్ ఎంపిక చేసుకుంటే బీఏ (పొలిటికల్ సైన్సెస్ ఆనర్స్) పేరుతో డిగ్రీ ప్రదానం చేస్తారు.

ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు

2023-24 విద్యా సంవత్సరం నుంచే ఆనర్స్ డిగ్రీ విధానం అమలు చేయనున్నాం. ఉన్నత విద్యామండలి నిర్దేశించిన రీతిలోనే ఆనర్స్ విధివిధానాలకు రూపకల్పన జరుగుతోంది. ఇందులో ఇంకా ఏమైనా సందేహాలుంటే పంపాలని ఈ నెల 21వ తేదీని తుది గడువుగా నిర్దేశించారు. ఈ నేపథ్యంలో డిగ్రీ కళాశాల యాజమాన్యాల సందేహాలను పరిగణలోకి తీసుకుని ఉన్నత విద్యామండలికి పంపాం. ప్రధానంగా ఒక మెయిన్ సబ్జెక్టుతోనే డిగ్రీ ఆనర్స్ అమల్లోకి రానుంది.

– ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి, వీసీ, ఎస్కేయూ

ఉన్నత విద్యామండలి ప్రతిపాదిత సింగిల్ మేజర్ ప్రోగ్రామ్ ఇలా

డిగ్రీలో ఆనర్స్ పట్టా జారీ విధానంపై ఉన్నత విద్యామండలి కొన్ని ప్రతిపాదనలు చేసింది. వాటిలో ప్రధానంగా సైన్స్ చదివే విద్యార్థులకు బీఎస్సీ (హ్యూమన్ జెనెటిక్స్), బీఎస్సీ (బయో ఇన్ఫర్మేషన్), బీఎస్సీ(మైక్రోబయాలజీ), బీఎస్సీ (అగ్రికల్చర్, సైకాలజీ, ఫుడ్ సైన్స్, న్యూట్రిషన్, ఫోరెన్సిక్ సైన్స్, హార్టికల్చర్, యానిమేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, డేటా సైన్స్, సైబర్ ఫోరెన్సెస్, ఆక్వాకల్చర్, ఫిషరీస్, హోమ్ సైన్సెస్, బయో కెమిస్ట్రీ, బయో టెక్నాలజీ, కంప్యూటర్ మెయింటెనెన్స్, స్టాటిస్టిక్స్, జియాగ్రఫీ, ఎలక్ట్రానిక్స్, జియాలజీ, డేటా మైనింగ్, ఫిజిక్స్, బోటనీ, కెమిస్ట్రీ, జువాలజీ, కంప్యూటర్ సైన్సెస్, ఈఆర్‌పీ మల్టీమీడియా, వెబ్ డిజైనింగ్‌లో ఆనర్స్ ప్రదానం చేస్తారు. అలాగే ఆర్ట్సులో బీఏ (స్టాటిస్టిక్స్, సైకాలజీ, హెచ్‌ఆర్‌ఎం, సోషల్ వర్క్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్స్, మ్యూజిక్, తెలుగు లిటరేచర్, స్పెషల్ తెలుగు, ఫిలాసఫీ, ఇంగ్లిష్ లిటరేచర్, ట్రావెల్, టూరిజం మేనేజ్‌మెంట్, హిస్టరీపై ఆనర్స్, బీబీఎం, బీబీఏ, బీకాం (జనరల్/కంప్యూటర్ అప్లికేషన్స్), బీసీఏలో ఆనర్స్ డిగ్రీలు ఇవ్వనున్నారు.

హతురాలు రమాదేవి కుటుంబానికి భూమి పట్టా అందజేత



ఇల్లు, భూమి పట్టాలను అందజేస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

శింగనమల: ఆటో డ్రైవర్ చేతిలో మోసపోయి హత్యకు గురైన నార్పల మండలం బొందలవాడకు చెందిన రమాదేవి కుటుంబసభ్యులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంది. ఘటన చోటు చేసుకున్న నెల రోజుల వ్యవధిలోనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఆదేశాల మేరకు బాధిత కుటుంబసభ్యులకు నార్పలలో ఐదు సెంట్ల ఇంటి స్థలం, హెచ్.సోదనపల్లి రెవెన్యూ పరిధిలో ఐదు ఎకరాల భూమికి సంబంధించిన పట్టాను అధికారులు మంజూరు చేశారు. వీటిని రమాదేవి తల్లిదండ్రులు నారాయణ, నారాయణస్వామికి శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి గురువారం ఉదయం తన క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రంగయ్య, ఆర్‌ఐ సందీప్, వీఆర్వో దాదాపీరా పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్తును వేగవంతం చేయండి

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య



అనంతపురం క్రైం: నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవడంతో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య సూచించారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 20వ తేదీ వరకు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించాలని పార్టీ అధిష్టానం తొలుత నిర్ణయం తీసుకుందని గుర్తు చేశారు. అయితే కార్యక్రమాన్ని వంద శాతం పూర్తి చేసే క్రమంలో ఈ నెల 29వ తేదీ వరకూ గడువు పెంచినట్లు వివరించారు. టీడీపీ, జనసేన, వామ పక్షాల మద్దతుదారుల ఇళ్లకు వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందించిన సంక్షేమం, చేపట్టిన అభివృద్ధిని వివరించాలన్నారు. ముఖ్యంగా గత టీడీపీ పాలనలో ప్రజలు పడ్డ ఇబ్బందుల ప్రజలను చైతన్య పరచాలన్నారు. ప్రస్తుతం జిల్లాలో 70 శాతం లబ్దిదారుల ఇళ్లకు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, గృహసారథులు, వలంటీర్లు, తదితరులు సందర్శించారన్నారు.

త్వరలోనే కాఫీ విత్ మెన్ : డీఐజీ అమ్మిరెడ్డి



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న డీఐజీ

ధర్మవరం అర్బన్: త్వరలోనే కాఫీ విత్ మెన్ కార్యక్రమాన్ని అమలు చేస్తామని డీఐజీ అమ్మిరెడ్డి తెలిపారు. ధర్మవరం పట్టణంలోని వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌ను గురువారం రాత్రి డీఐజీ అమ్మిరెడ్డి తనిఖీ చేశారు. స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాధవరెడ్డి, డీఎస్పీ హుసేన్‌బాషా, సీఐలతో సమావేశం నిర్వహించారు. 'కాఫీ విత్ మెన్ 'లో భాగంగానే అన్ని పోలీసుస్టేషన్లలో సిబ్బంది, మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించాలన్నారు. రౌండ్‌గా కుర్చీలు వేసుకొని కాఫీ తాగుతూ ఫ్రెండ్లీగా మాట్లాడుకోవాలని సూచించారు. గతవారం ఏం చేశాం, వచ్చే వారంలో ఏమేం చేయాలి? ఎక్కడెక్కడ ఏం జరుగుతోందో వివరాలు సేకరించాల్సిన బాధ్యత స్టేషన్ ఆఫీసర్లపై ఉందన్నారు. డీఐజీ వెంట వన్‌టౌన్ సీఐ సుబ్రమణ్యం, టూటౌన్ సీఐ రాజా, ట్రాఫిక్ సీఐ వహీద్ బాషా తదితరులు ఉన్నారు.

చెలరేగిన చైన్‌స్నాచర్లు

- వేర్వేరు ప్రాంతాల్లో మహిళల మెడలోని బంగారు గొలుసుల అపహరణ
- పల్సర్ బైక్‌పై వచ్చి లాక్కెళ్లిన దుండగులు



చైన్‌స్నాచింగ్ చేసేందుకు మహిళ వద్ద చక్కర్లు కొడుతున్న దుండగులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లాలో చైన్ స్నాచర్లు చెలరేగారు. వేర్వేరు ప్రాంతాల్లో మహిళ మెడలోని బంగారు గొలుసులు అపహరించుకెళ్లారు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురంలోని ఐదో రోడ్డుకు చెందిన మారెక్క.. ఇళ్లలో పాచి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో గురువారం ఉదయం 7.50 గంటలకు ఐదో రోడ్డులోని వై జంక్షన్ సమీపంలో డాక్యుమెంటర్ రైటర్ శ్రీనివాసులు ఇంటి ఎదుట కసువు ఊడుస్తుండగా పల్సర్ బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు ఆమెను మాటల్లో పెట్టి మెడలోని బంగారు గొలుసు లాక్కొని ఉడాయించారు. ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు అనంతపురం మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఉదయం 5.30 గంటలకు యల్లనూరులో..

యల్లనూరు: మార్నింగ్ వాకింగ్ చేస్తున్న మహిళ మెడలోని మూడు తులాల బంగారు గొలుసును దుండగుడు అపహరించుకెళ్లారు. గురువారం ఉదయం 5.30 గంటలకు యల్లనూరు సచివాలయ కన్వీనర్ నారాయణమ్మ చిత్రావతి నది సమీపంలో మార్నింగ్ వాకింగ్ వెళ్లింది. ఆ సమయంలో స్కూటీపై హెల్మెట్ ధరించిన ఆగంతకులు ఆమె వద్దకు చేరుకుని మెడలోని బంగారు గొలుసు లాక్కొనేందుకు ప్రయత్నించాడు. ఆ సమయంలో ఆమె ప్రతిఘటించడంతో జుట్టుపట్టుకుని లాగాడు. దీంతో అతను వేసుకున్న హెల్మెట్‌ను నారాయణమ్మ అందిపుచ్చుకుని ఎదురు దాడికి దిగింది. ఇంతలో ఆమె మెడలోని బంగారు చైన్‌ను లాగేసుకున్న దుండగుడు.. హెల్మెట్ తీసుకుని ద్విచక్ర వాహనంపై ఉడాయించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

అప్రమత్తమైన పోలీసులు : నగరంతో పాటు యల్లనూరులో చైన్ స్నాచింగ్‌లు జరిగినట్లు తెలుసుకున్న పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. డీఎస్పీ స్థాయి అధికారితో పాటు ఐడీ బృందాలు రంగంలో దిగాయి. బాధిత మహిళల నుంచి సమాచారాన్ని సేకరించి, స్నాచర్లు నడుపుతున్న ద్విచక్ర వాహనాలతో పాటు, వారి ఆనవాళ్లు గుర్తించేందుకు సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. మారెక్కతో మాట్లాడుతూనే ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లిన దృశ్యాలు సీసీకెమెరాల్లో నిక్షిప్తమయ్యాయి.

కర్నూలుకు చెందిన స్నాచర్లు? ; జిల్లా కేంద్రంలో చైన్‌స్నాచింగ్ పాల్పడిన ఇద్దరు దుండగులు.. కర్నూలు జిల్లా డోన్ పట్టణంలో మరో స్నాచింగ్‌కు విఫలయత్నం చేశారు. కాగా మహిళ అప్రమత్తంగా వ్యవహరించడంతో తప్పించుకుని పారిపోయారు. మధ్యాహ్నం 3 గంటలకు పైన ఈ ఘటన చోటు చేసుకున్నట్లు పోలీసుల గ్రూపుల్లో సమాచారం వైరల్ కావడంతో అనంతపురంలో చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన వారేనని ఇక్కడి పోలీసులు గుర్తించారు.

సీఎంను కలిసిన మంత్రి ఉషశ్రీచరణ్



కళ్యాణదుర్గం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని గురువారం రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తన కుమార్తె, కుమారుడును సీఎంకు ఆమె పరిచయం చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం మంత్రి కుటుంబసభ్యులతో సీఎం కాసేపు ముచ్చటించారు.

లారీ డ్రైవర్ ఆత్మహత్య



మృతుడు సుబ్రహ్మణ్యం

గుత్తి: అనారోగ్యం నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. యాడికి మండలం చందన గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యంకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్నా.. నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న సుబ్రహ్మణ్యం గురువారం ఉదయం జక్కలచెరువు రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాలపైకి చేరుకుని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై జీఆర్పీ ఎస్ఐ నాగప్ప కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఎస్పీ రాధిక సోదరుడి మృతి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: శ్రీకాకుళం జిల్లా ఎస్పీ రాధిక సోదరుడు శ్రీకాంత్ (48) అనంతపురంలోని ఓ అద్దె ఇంట్లో మృతి చెందాడు. రెండు రోజులు ఆలస్యంగా ఈ విషయం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన మేరకు... శ్రీసత్యసాయి జిల్లా మడకశిరకు చెందిన రాధికకు శ్రీకాంత్ స్వయాన అన్న. కుటుంబ కలహాల నేపథ్యంలో కొంత కాలంగా అనంతపురంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ఓ అద్దె ఇంట్లో ఒంటరిగా నివసిస్తున్నాడు. మూర్ఛవ్యాధితో బాధపడుతున్నాడు. గురువారం ఉదయం శ్రీకాంత్ ఉంటున్న ఇంట్లో నుంచి దుర్వాసన వెదజల్లడంతో స్థానికుల నుంచి సమాచారం అందుకున్న అనంతపురం మూడో పట్టణ పోలీసులు అక్కడకు చేరుకుని ఇంటి తలుపులు తీసి పరిశీలించారు. లోపల శ్రీకాంత్ మృతదేహం కనిపించింది. రెండు రోజుల క్రితం మృతి చెందినట్లుగా ప్రాథమికంగా నిర్ధారించారు. ఫిట్స్ వచ్చినప్పుడు సాయం చేసే వారు ఎవరూ అందుబాటులో లేకపోవడంతో ఆయన మృతి చెంది ఉంటాడనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఇదే విషయాన్ని శ్రీకాంత్ బంధువులూ నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న వాహనాలను చూపుతున్న విజిలెన్స్ అధికారులు

యాడికి: అక్రమంగా తరలిస్తున్న 121 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అందిన సమాచారం మేరకు విజిలెన్స్ సీఐ రామారావు ఆధ్వర్యంలో యాడికి మండలం చందన గేట్ గురువారం ఉదయం వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన మూడు బొలెరో వాహనాలను ఆపి తనిఖీ చేయగా 121 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడింది. వాహనాలను సీజ్ చేసి, బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యం తరలిస్తూ నంద్యాల జిల్లా పీఆర్ పల్లికి చెందిన రవికుమార్, జక్కసానికుంట్ల గ్రామానికి చెందిన రామాంజినేయులు, డి.రంగాపురం నివాసి చిన్న సుంకన్న, తాడిపత్రి నివాసి నాగార్జున పట్టుబడ్డారు. పీఆర్‌పల్లి రామాంజినేయులు, డోన్ మండలం సోమాపురానికి చెందిన మహేంద్ర పారిపోయారు. నిందితులను యాడికి ఎస్ఐ గురుప్రసాదరెడ్డికి అప్పగించారు. విజిలెన్స్ ఏఈఈ రవీంద్రనాథ్ తదితరులున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

గుంతకల్లు: తిలక్ నగర్‌లో పేకాట నిర్వహిస్తున్న ఓ ఇంటిపై స్పెషల్ ఆపరేషన్ గ్రూప్ దాడులు నిర్వహించి, 34 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుంది. నిందితుల ద్విచక్రవాహనాలు, సెల్‌ఫోన్లతో పాటు రూ.9.19 లక్షలు స్వాధీనం చేసుకుని, రెండో పట్టణ పోలీసులకు అప్పగించారు. జూదరులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరిచినట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు.

సమస్యల పరిష్కారానికి సహకరించండి

- కలెక్టర్ గౌతమికి మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి వినతి



కలెక్టర్ గౌతమితో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

అనంతపురం అర్బన్: ఉరవకొండలోని 600 మంది లబ్ధిదారులకు సంబంధించి ఇళ్ల పట్టాల వ్యవహారం కోర్టు కేసు కారణంగా నేటికీ పంపిణీకి నోచుకోలేకపోయిందని, ఈ సమస్యను సత్వరమే పరిష్కరించి లబ్దిదారులకు పట్టాలు అందజేయాలని కలెక్టర్ గౌతమికి ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి విన్నవించారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లోని ఆమె చాంబర్‌లో విశ్వేశ్వరరెడ్డి కలసి వినతిపత్రం అందజేసి, మాట్లాడారు. మండలంలోని హెచ్చెల్సీ నుంచి పీఏబీఆర్‌కు వెళ్లే లింక్ కెనాల్ శిథిలావస్థకు చేరుకుందని, శాశ్వత ప్రాతిపదికన ఈ కెనాల్ ఆధునీకరణ పనులు చేపట్టాలని కోరారు. ఉరవకొండలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రభుత్వం మంజూరు చేసిన ఉదిరిపికొండ పైప్‌లైన్ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలో అదనపు సంపు నిర్మాణం, పైప్‌లైన్ల మరమ్మతు వంటి అత్యవసర పనులు చేపట్టేలన్నారు. వజ్రకరూరు, బెళుగుప్ప, కూడేరు మండలాల్లో గిరిజనులు సాగు చేసుకుంటున్న అటవీ భూములకు హక్కు పట్టాలు మంజూరుకు చర్యలు తీసుకోవాలని కోరారు. రాకెట్ల– ఆమిద్యాల లిఫ్ట్ నిర్మాణానికి రైతుల నుంచి స్వాధీనం చేసుకున్న 70 ఎకారాల భూమికి సంబంధించి రూ.8.40 కోట్లు పరిహారం అందజేయాలని విన్నవించారు. ఉరవకొండ మండలంలోని ఆమిద్యాల, కూడేరు మండలంలోని కమ్మూరు, పి.నారాయణపురం, మరుట్ల మూడవ కాలనీలో తాగునీరు అందుబాటులో ఉన్నా.. నీటిని నిలువ చేసి సరఫరా చేసే వ్యవస్థ లేని కారణంగా తాగునీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఆయా గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం చేపడితే సమస్యకు పరిష్కారం దొరుకుతుందని సూచించారు. ఎంఎంహళ్లిలో రక్షిత మంచి నీటి వ్యవస్థకు చర్యలు తీసుకోవాలన్నారు. కరుట్లపల్లి చెరువు కట్ట బలహీనపడిందని, ఈ కట్ట వెడల్పు పెంచి పటిష్టతకు చర్యలు తీసుకునేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని కోరారు. కొకుంట్ల, ఆమిద్యాల, రూప్లానాయక్ తండా, చాబాల గ్రామాల్లో అర్హులైన వారికి ఇంటి పట్టాలు మంజూరు చేయాలని విన్నవించారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్

- ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి
- ఎస్‌ఆర్‌ఐటీలో ముస్లింలకు ఇఫ్తార్ విందు





భోజనాలు వడ్డిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఎంపీ తలారి రంగయ్య, ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

శింగనమల: మతసామరస్యానికి ప్రతీక రంజాన్ పర్వదినమని శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. గురువారం బుక్కరాయసముద్రం మండలంలోని ఎస్ఆర్ఐటీలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఎంపీ తలారి రంగయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహమ్మద్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే పద్మావతి మాట్లాడుతూ... రంజాన్ మాసాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరిస్తున్న ముస్లింలను అభినందించారు. నిబద్ధతకు ప్రతిరూపమైన ముస్లింల అభ్యున్నతికి దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి బాటలు వేయగా... అదే స్థాయిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యతిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు భాస్కర్, భోగాతి ప్రతాపరెడ్డి, భాస్కరరెడ్డి, సర్పంచ్ పార్వతమ్మ, డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఫయాజ్, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గౌస్‌బేగ్, జిల్లా మైనారిటీ అధ్యక్షుడు సైఫులాబేగ్, బాబా ఫకృద్దీన్, జిల్లా వక్ఫ్ బోర్డు సభ్యుడు నూర్ మహమ్మద్, వైఎస్సార్ సీపీ నాయకులు ఆలూరు రమణారెడ్డి, నార్పల సత్యనారాయణరెడ్డి, నారాయణస్వామి, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



జగనన్న నువ్వే మా నమ్మకం బ్రోచర్ అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ కుల, మత, పార్టీలతో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలు అందాయని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి , మండల సచివాలయ కన్వీనర్ వడ్డుపల్లి నరసింహారెడ్డి తెలిపారు. గురువారం మండల వ్యాప్తంగా జగనన్న నువ్వే మా నమ్మకం కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల ఆధ్వర్యంలో ప్రతి ఇంటికీ తిరిగి ప్రభుత్వ పథకాలపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు వాటర్‌ప్లాంట్ ప్రారంభం

రామగిరి: పేరూరు డ్యాంలో రెన్యూ గాలిమరల కంపెనీ ఆధ్వర్యంలో వాటర్‌ప్లాంట్ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి హాజరుకానున్నట్లు సర్పంచ్ సరస్వతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం కనగానపల్లి మండలం భానుకోటలో మరో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించి, ఉదయం 11:30కు పేరూరు డ్యాంలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి



మాట్లాడుతున్న అంగన్‌వాడీ వర్కర్ల సంఘం జిల్లా కార్యదర్శి రమాదేవి

అనంతపురం అర్బన్: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శకుంతల, రమాదేవి అన్నారు. మేడే రోజున జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్మిక జెండా ఆవిష్కరించాలని పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సంఘం కార్యాలయంలో సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. అంగన్‌వాడీల సమస్యలపై మే నెల 24న మినీ వర్కర్లకు గుంటూరు డైరెక్టరేట్ వద్ద ధర్నా ఉంటుందన్నారు. జూన్, జూలై నెలల్లో దశల వారీగా పోరాటాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు నాగేంద్రకుమార్, కోశాధికారి జమున, తదితరులు పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తులు

అనంతపురం కల్చరల్: కల్యాణదుర్గం మండలంలోని అక్కమ్మ దేవత ఆలయ ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎండోమెంట్ జిల్లా ఏసీ రామాంజనేయులు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు 20 రోజుల్లోపు ' డిప్యూటీ కమిషనర్ కార్యాలయం, దేవదాయ శాఖ, కృష్ణానగర్, కర్నూలు' చిరునామాకు చేరేలా దరఖాస్తులు పంపాలన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి



రంగస్వామి నగర్‌లో కాలువ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రమణారెడ్డి

అనంతపురం క్రైం: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ రమణారెడ్డి ఇంజినీర్లను ఆదేశించారు. గురువారం నగరంలోని 67 సచివాలయ పరిధిలోని రంగస్వామి నగర్‌లో జరుగుతున్న కాలువ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. నిర్మాణ పనులు జరిగే సమయంలో అమినిటీ, వర్క్ ఇన్‌స్పెక్టర్లు అందుబాటులో ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు పనులను పరిశీలించాలని ఏఈ శంకర్‌ను ఆదేశించారు. అనంతరం వివిధ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. ఇంటింటా చెత్త సేకరించాలన్నారు. క్లాప్ ఆటోలు రాని పక్షంలో తన దృష్టికి తీసుకురావాలని కార్యదర్శులకు సూచనలిచ్చారు.

ఫార్మసీ కళాశాలలో అవినీతిపై విచారించండి



వీసీకి వినతిపత్రం అందజేస్తున్న పృథ్వి

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం- ఓటీపీఆర్ఐ ఫార్మసీ కళాశాలలో అవినీతి అక్రమాలకు పాల్పడిన మాజీ డైరెక్టర్, మాజీ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ ఏఐఎస్‌బీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాపిరెడ్డిపల్లి పృథ్వి డిమాండ్ చేశారు. ఈ మేరకు జేఎన్‌టీయూ అనంతపురం వీసీ జింకా రంగజనార్దనకు గురువారం వినతి పత్రం అందజేశారు. ఇష్టానుసారంగా పనులు చేయనప్పటికీ, అధికంగా బిల్లులు పెట్టుకొని రూ.లక్షలు ఆర్జించారని విమర్శించారు. సమగ్ర దర్యాప్తు జరిపి అవినీతి సొమ్మును రికవరీ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

మరింత సేవ చేసే అవకాశం కల్పించాలి

- సిండికేట్‌నగర్ ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: పేదలకు రానున్న రోజుల్లో మరిన్ని సేవలందించే అవకాశం కల్పించాలని అల్లాను కోరినట్లు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని పేద ముస్లింలకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో రంజాన్ తోఫా పంపిణీ చేయనున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, వలంటీర్ల ద్వారా ఇళ్లకు చేర్చుతామని ఎమ్మెల్యే ప్రకటించారు. గురువారం సాయంత్రం అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి పంచాయతీ సిండికేట్‌నగర్‌లో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముందుగా ఎమ్మెల్యేతో పాటు మాజీ మున్సిపల్ చైర్మన్ నూర్‌మహమ్మద్ తదితరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం విందులో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శుక్రవారం నియోజకవర్గంలోని ముస్లింలకు రంజాన్‌తోఫా పంపిణీ చేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, వలంటీర్ల ద్వారా ఇళ్ల వద్దకు చేర్చుతామన్నారు. ఇంతటి అవకాశం కల్పించిన అల్లాకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్ అంజి యాదవ్, ఎంపీటీసీ గౌస్, స్థానిక నాయకులు భానుకోట శివ, బాలకృష్ణ, పూజారి రాము, గుగ్గిళ్ల జయకృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు. అనంతరం స్థానిక సుందరయ్యకాలనీకి వెళ్లి రంజాన్ తోఫా పంపిణీకి సంబంధించిన సరుకులను పరిశీలించారు.



ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ నూర్‌మహమ్మద్ తదితరులు

పథకాలతో ప్రతి కుటుంబం సంతోషం



రాప్తాడులో 'జగనన్న మా భవిష్యత్తు' స్టిక్కర్లను పంపిణీ చేస్తున్న నాయకులు

రాప్తాడు: వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన నాలుగేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా రూ.లక్షల్లో లబ్ధి చేకూరడంతో ప్రతి కుటుంబం సంతోషంగా ఉందని వైఎస్సార్ సీపీ రాప్తాడు గ్రామ పంచాయతీ అధ్యక్షుడు చిరుతల నాగేంద్ర అన్నారు. మండల కేంద్రం రాప్తాడులో పద్నాలుగో రోజూ 'జగనన్న మా భవిష్యత్తు-మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు కలిసి ఇంటింటికీ వెళ్లి పలకరించారు. కార్యక్రమంలో డీలర్ లక్ష్మన్న, పూజారి ఓలయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంట్లోనూ ఆనందం



'మా నమ్మకం నువ్వే జగన్' బ్రోచర్‌ను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాప్తాడురూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబంలోనూ ఆనందం వెల్లివిరిస్తోందని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. గురువారం అనంతపురం రూరల్ మండలం కురుగుంటలో ×జగనన్నే మా భవిష్యత్తు₹, ×మా నమ్మకం నువ్వే జగన్₹ కార్యక్రమాన్ని చేపట్టారు. ఉప సర్పంచ్ మాధవరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కిరణ్‌కుమార్‌రెడ్డి, నాయకులు ముస్తఫా, ఆదినారాయణ, రఫీ, డీలర్ రవి, సంజీవరెడ్డి, ఓబుళపతి, వెంకటేష్ నాయక్, రామకృష్ణ, మన్సూర్, వలంటీర్లు వైఎస్సార్‌కాలనీలోని ఇంటింటికీ తిరిగారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత వివిధ పథకాల ద్వారా డబ్బులు నేరుగా మా అకౌంట్లలో జమ చేస్తున్నారని మహిళలు ఆనందం వ్యక్తం చేశారు.

'స్పాట్' కేంద్రంలో సిక్ రూం ఏర్పాటు చేయాలి

రాప్తాడురూరల్: వేసవిని దృష్టిలో ఉంచుకుని పదో తరగతి జవాబు పత్రాల స్పాట్ కేంద్రంలో సిక్ రూమ్ ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) నాయకులు కోరారు. గురువారం విద్యాశాఖ ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్ మాట్లాడుతూ స్పాట్ విధుల్లో ఎవరైనా అనారోగ్యానికి గురైతే విశ్రాంతి తీసుకునేందుకు ప్రత్యేక గది ఉండాలన్నారు. మూల్యాంకనం పూర్తయిన వెంటనే ఏసీఎ, ఏఈ, సీఈ, స్పెషల్ అసిస్టెంట్లకు పూర్తి స్థాయిలో రెమ్యూనరేషన్ చెల్లించాలన్నారు. కేంద్రంలో చల్లని తాగునీరు, క్యాంటీన్ వసతి కల్పించాలన్నారు. ఆర్జేడీని కలిసిన వారిలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సర్దార్‌వలి, నాయకులు చాయప్ప, చిదంబరరెడ్డి, కోటిగారి వన్నప్ప, హరిహరనాథ్ ఉన్నారు.



ఆర్జేడీకి వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

ఈఎంఐలకు వెసులుబాటు ఇవ్వండి



ఎల్‌డీఎం నాగరాజరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ అమరావతి నాయకులు

అనంతపురం అర్బన్: వేతనాలు ఆలస్యం అవుతున్నందున రుణాలకు సంబంధించి చెల్లించాల్సిన ఈఎంఐలకు వెసులుబాటు కల్పించాలని బ్యాంకర్లను ఏపీ జేఏసీ అమరావతి నాయకులు కోరారు. ఎల్‌డీఎం నాగరాజరెడ్డి, ఎస్‌బీఐ ఆర్ఎం కుమార్, యూనియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ గోపన్నను సంఘం జిల్లా చైర్మన్ దివాకర్‌రావు, తదితరులు కలిసి వినతిపత్రం సమర్పించి, సమస్య విన్నవించారు. ఉద్యోగులకు సకాలంలో వేతనం రాని కారణంగా ఐదో తేదీన ఈఎంఐలు చెల్లించలేకపోతున్నారని చెప్పారు. దీంతో వడ్డీ భారం పడుతోందని, ఈఎంఐల విషయంలో వెసులుబాటు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం అసోసియేట్ చైర్మన్ మల్లారాయుడు, నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట చెన్నప్ప, నాయకులు సంతోష్‌గౌడ్, శ్రీప్రసాద్, మహబూబ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

పావని ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స

అనంతపురం క్రైం: నగరంలోని పావని ఆస్పత్రిలో గుండె సమస్యతో బాధపడుతున్న ఓ వృద్ధురాలికి ప్రముఖ గుండె వైద్య నిపుణుడు డాక్టర్ వంశీకృష్ణ చేసిన శస్త్రచికిత్స విజయవంతమైంది. దాదాపుగా 7 గంటల పాటు శ్రమించి, వృద్ధురాలికి సీఆర్‌టీడీ అనే పరికరాన్ని గుండె భాగంలో అమర్చి పునర్జన్మను ప్రసాదించారు. వివరాలను డాక్టర్ వంశీకృష్ణ గురువారం ఆస్పత్రిలో విలేకరులకు వెల్లడించారు. తాడిమర్రి మండలం కునుకుంట్ల గ్రామానికి చెందిన సువర్ణమ్మ (58) గుండెనొప్పితో ఈ నెల 13న పావని ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యిందన్నారు. పల్స్ రేటు 22 మాత్రమే ఉండడంతో ఆదేరోజు ఆమె అపస్మారక స్థితిలో వెళ్లిందన్నారు. అవసరాన్ని బట్టి గుండె అదిరినప్పుడు షాక్ ఇస్తూ, భవిష్యత్తులో గుండె ఫెయిల్యూర్ కాకుండా సీఆర్‌టీడీ పరికరాన్ని అమర్చాల్సి ఉందని వృద్ధురాలి కుమారుడు కరుణాకర్, తదితర కుటుంబీకులకు తెలియజేశామన్నారు.

ఏడు గంటల పాటు సర్జరీ:

తనతో పాటు ఎలక్ట్రో ఫిజియాలజిస్టు డాక్టర్ శివశంకర్, అనస్తీషియా వైద్యుడు గౌతమ్, సిబ్బంది ఈ నెల 16న వృద్ధురాలు సువర్ణమ్మకు క్యాథ్‌ల్యాబ్‌లో 7 గంటల పాటు శస్త్రచికిత్స విజయవంతంగా చేశామన్నారు. పదేళ్ల పాటు పరికరం లైఫ్ ఉంటుందన్నారు. గుండెకు సంబంధించిన శస్త్ర చికిత్సలు సకాలంలో చేయని పక్షంలో ప్రాణాపాయం ఉంటుందన్నారు. ప్రధాన నగరాల్లో చేసే ఇలాంటి అరుదైన శస్త్ర చికిత్సను జిల్లా ప్రజలకు అందుబాటులో తెచ్చామన్నారు. పావని ఆస్పత్రి అధినేత డాక్టర్ గుత్తా రవీంద్ర, అనస్తీషియా వైద్యులు డాక్టర్ గౌతమ్, తదితరులు పాల్గొన్నారు.



ఆపరేషన్ పూర్తయిన అనంతరం సువర్ణమ్మతో డాక్టర్లు వంశీకృష్ణ, గుత్తా రవీంద్ర

మార్గదర్శి మనీలాండరింగ్‌ను ఆపాలి

అనంతపురం: రామోజీ మార్గదర్శి మనీలాండరింగ్‌ను ఆపాలని అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి అధ్యక్షుడు కేవీ రమణ ఓ ప్రకటనలో అన్నారు. మార్గదర్శి డిపాజిట్ల ముసుగులో ఏటా రూ.600 కోట్ల ప్రజాధనాన్ని బ్లాక్ మనీ మార్చిడి, మార్గదర్శి చిట్‌ఫండ్ కార్యాలయాలు నల్లధన మార్పిడి కేంద్రాలుగా మార్చివేశారన్నారు.' మార్గదర్శిపై ఒక్క ఏజెంట్ కూడా ఫిర్యాదు చేయలేదు.. అయినా విచారణ చేయడం విడ్డూరంగా ఉందని' కొందరు చంద్రబాబు నాయుడు చల్లిన మెతుకులు ఏరుకునే వారు అనడం విడ్డూరంగా ఉందన్నారు. అమరావతి రాజధాని భూముల్లో ఇన్‌సైడర్ బిజినెస్ జరిగినట్లు సిట్ దర్యాప్తులో నిర్ధారణ అయింది. ఎఫ్ఐఆర్ నమోదు చేస్తే ,దానిపై హైకోర్టు దర్యాప్తు చేయకూడదని , మీడియా ప్రచురించకూడదని చెప్పినప్పుడు రామోజీ తరపు వకాల్తా పుచ్చుకున్న న్యాయవాదులు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. మార్గదర్శి ముసుగులో మనీలాండరింగ్‌కు పాల్పడుతున్న రామోజీరావును తప్పిస్తే, భవిష్యత్‌లో మరిన్ని నకిలీ మార్గదర్శిలు పుట్టుకొస్తాయన్నారు.

విద్యార్థులకు అండగా నిలవాలి

బుక్కరాయసముద్రం: వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతాంగానికి అండగా నిలవాలని పుట్టపర్తి జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ రామసుబ్బయ్య పేర్కొన్నారు. గురువారం పి.కొత్తపల్లిలో తిరుపతి వ్యవసాయ కళాశాల బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థుల ఆధ్వర్యంలో రైతు సదస్సు నిర్వహించారు. రెడ్డిపల్లి పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రవికిశోర్, తిరుపతి వ్యవసాయ కళా శాల ప్రొఫెసర్ డాక్టర్ ప్రదీప్ పాల్గొన్నారు.

పెనకచెర్లలో అసిస్టెంట్ కలెక్టర్ పర్యటన

గార్లదిన్నె: పెనకచెర్లలో అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్ గురువారం పర్యటించారు. స్పందనలో భూ సమస్యకు సంబంధించి ఫిర్యాదు రావడంతో ఆయన క్షేత్రస్థాయిలో ఇద్దరు రైతుల పొలాలు పరిశీలించి రైతుల సాగు మేరకు విస్తీర్ణం వివరాలు అందజేయాలని రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. అలాగే మరొక చోట అన్నదమ్ములు మధ్య రస్తా వివాదం ఉంటే పరిశీలించి, రస్తా సబ్ డివిజన్ చేసుకొని సమస్య పరిష్కరించుకోవాలని సూచించారు. తహసీల్దార్ ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

చైతన్య పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే

రాప్తాడురూరల్: నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని చైతన్య ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే గురువారం ఘనంగా జరుపుకున్నారు. ప్రిన్సిపాల్ పర్వీన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు ఏజీఎం సుబ్బారెడి, కోఆర్డినేటర్ తిరుమలేశ్వరరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారి చేతులమీదుగా చిన్నారులకు గ్రాడ్యుయేషన్ పత్రాలను అందించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



విద్యార్థులతో పాఠశాల సిబ్బంది

ట్రాఫిక్ సిబ్బందికి మౌలిక సదుపాయాలు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అనంతపురం ట్రాఫిక్ పోలీసుల సంక్షేమంతో పాటు వారికి అవసరమైన ఉపకరణాలను ఎస్పీ కె. శ్రీనివాసరావు అందించారు. గురువారం ఉదయం స్థానిక ట్రాఫిక్ పోలీసు స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎండలు మండిపోతున్నాయని, సిబ్బంది విధుల్లో తీవ్రంగా శ్రమించాల్సి వస్తోందన్నారు. వారి ఆరోగ్యాలు కూడా బాగుండాలని, అందులో భాగంగా వారికి వాటర్ బాటిళ్లతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఉపకరణాలు అందజేసినట్లు తెలిపారు. సిబ్బంది కొరత ఉందని ట్రాఫిక్ ఇన్‌చార్జ్ డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి చెప్పారు. సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

నేడు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి పర్యటన

కనగానపల్లి: భానుకోటలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి శుక్రవారం పర్యటించనున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న మినరల్ వాటర్ ప్లాంటును ఎమ్మెల్యే ప్రారంభించనున్నట్లు జెడ్పీటీసీ మారుతీప్రసాద్ తెలిపారు. ఉదయం 10 గంటలకు జరగనున్న ఈ కార్యక్రమానికి మండల ప్రజాప్రతినిధులు, అధికారులతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలంతా హాజరుకావాలన్నారు.

నేడు బొమ్మేపర్తిలో కంటిపొర శిబిరం

రాప్తాడు: బొమ్మేపర్తి గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో శుక్రవారం నుంచి వారం రోజుల పాటు ఉచిత కంటి పొర చికిత్స శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు అపెక్స్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత తిరుపాల్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. గణపతి సచ్చిదానంద స్వామి ఆశ్రమంలో ఈ నెల 21 నుంచి 28 వరకు పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. ఎవరైనా కళ్లకు చూపించుకునే వారు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వివరాలకు కోదండరామిరెడ్డి సెల్: 94400 40496, వేణుగోపాల్ రెడ్డి సెల్: 98494 32268, నవీన్ దత్త సెల్: 91826 53038లో సంప్రదించాలన్నారు.

24న జైభారత్ సత్యాగ్రహ సభ

అనంతపురం టవర్‌క్లాక్: ఈ నెల 24న విజయవాడలో జరగనున్న జై భారత్ సత్యాగ్రహ సభ జరగనున్నట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో చలో విజయవాడ పోస్టర్లు విడుదల చేశారు. బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ నిరంకుశ ధోరణితో పరిపాలన కొనసాగిస్తోందన్నారు. రాహుల్ గాంధీపై కేంద్ర ప్రభుత్వం కక్ష సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, శివశంకర్ యాదవ్, గాజుల వాసు, రామచరణ్ యాదవ్, శర్మాస్‌వలి, ఓబిరెడ్డి, నిశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బైక్ అపహరణపై ఫిర్యాదు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. ఇటీవల బస్టాండ్‌లోని క్యాంటీన్ వద్ద హెచ్ఎల్‌సీ ఉద్యోగి బైక్ పార్కింగ్ చేసి, టిఫిన్ తినేందుకు వెళ్లాడు. తిరిగి వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రేపటి నుంచి సిద్ధిగణపతి ఆలయ వార్షికోత్సవం

అనంతపురం కల్చరల్: రాంనగర్‌లోని సిద్ధి గణపతి స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం ఈనెల 22 నుంచి 24 వరకు నిర్వహిస్తున్నట్లు అర్చకుడు గరుడాద్రి సురేష్‌కుమార్ తెలిపారు. శనివారం గంగానయనం, గణపతి, గోపూజలు ఆదివారం మహాన్యాస పూర్వక ఏకాదశవార రుద్రాభిషేకాలు, వేదపారాయణం, సోమవారం సహస్రమోదక సహిత గణపతి హోమం, పూర్ణాహుతి ఉంటాయన్నారు.

మద్యం మత్తులో డ్రెయినేజీలో పడిపోయాడు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: రవి పెట్రోల్ బంకు సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న పెద్ద డ్రెయినేజీలో ఓ వ్యక్తి తప్పతాగి పడిపోయాడు. స్థానికులు గుర్తించి అతన్ని బయటకు చేర్చేందుకు గంటకు పైగా శ్రమించాల్సి వచ్చింది. బుధవారం రాత్రి చోటు చేసుకున్న ఈ ఘటనపై వైఎస్సార్‌సీపీ మాజీ కార్పొరేటర్ చింతకుంట మధు మాట్లాడుతూ పరిటాల రవి పెట్రోలు బంకు సమీపంలో మద్యం మత్తులో ఓ వ్యక్తి అందరూ చూస్తుండగానే డ్రైనేజీలో పడిపోయాడు. కాలువ లోతుగా ఉండటంతో కిందకు దిగి అతన్ని బయటకు తీయడానికి సమయం పట్టింది. జేసీబీ సహాయంతో అతన్ని సురక్షితంగా కాపాడగలిగామన్నారు. అదృష్టవశాత్తూ అతను ప్రాణాలతో బయటపడ్డాడని, చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి పంపించామన్నారు.

కార్మికశాఖ రుసుం సచివాలయాల్లో చెల్లించాలి

గుంతకల్లుటౌన్: పట్టణంలోని వ్యాపారులు, ప్రైవేట్ సంస్థల యాజమాన్యాలు కార్మికశాఖకు సంబంధించిన రుసుములు వార్డు సచివాలయాలు లేదా మీసేవా కేంద్రాల్లో మాత్రమే చెల్లించాలని గుంతకల్లు సహాయ కార్మికశాఖ అధికారి శివప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు తాము లేబర్ ఆఫీసర్లమంటూ వ్యాపారులకు ఫోన్ చేసి ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎంల ద్వారా రుసుములు చెల్లించాలని వ్యాపారులకు ఫోన్ చేసి బెదిరిస్తున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయని పేర్కొన్నారు. లేబర్ ఆఫీసర్ పేరిట అపరిచిత వ్యక్తులెవరైనా ఫోన్ చేస్తే వెంటనే 9492555193కి కాల్ చేయడమో లేదా ఆఫీసులో సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నేడు అభివృద్ధి పనులకు భూమిపూజ

అనంతపురం క్రైం: నగరంలోని 39వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శుక్రవారం భూమిపూజ చేయనున్నారు. ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, ఎంపీ తలారి రంగయ్య, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య హాజరుకానున్నారు. ఎమ్మెల్యే అనంత వెంకటామిరెడ్డి విజ్ఞప్తి మేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నగరాభివృద్ధికి ప్రత్యేకంగా కేటాయించిన రూ.25 కోట్ల అభివృద్ధి పనులకు భూమి పూజ చేయనున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ రమణారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

కాశీవిశ్వేశ్వరాలయం ఈఓగా రమేష్‌బాబు

అనంతపురం కల్చరల్: నగరంలో ప్రసిద్ధి చెందిన మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండరామాలయం ఈఓగా రమేష్‌బాబు రానున్నారు. ఉరవకొండ మండల పరిధిలోని ఉండబండ వీరభద్రస్వామి ఆలయ ఈవోగా పని చేస్తున్న ఆయనకు శివాలయం ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఈమేరకు జిల్లా ఎండోమెంట్ సహాయ కమిషనర్ రామాంజనేయులు గురువారం ఆ వివరాలు అందించారు. ప్రస్తుతం కాశీవిశ్వేశ్వరాలయం ఈఓగా పని చేస్తున్న సుధారాణిని పాతూరులోని ప్రాచీన చెన్నకేశవస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారిగా బదిలీ అయినట్లు తెలిపారు.

జేసీఎస్ కన్వీనర్‌కు సన్మానం

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థ కార్యాలయంలో జేసీఎస్ కన్వీనర్, వైఎస్సార్ సీపీ నాయకుడు చింతకుంట మధును మేయర్ వసీం గురువారం సన్మానించారు. ఈ నెల 16న 39వ డివిజన్ పరిధిలోని పెద్ద కాలువలో నారాయణస్వామి అనే వ్యక్తి పడిపోయాడు. కాలువలో పడిన వ్యక్తిని చింతకుంట మధు సురక్షితంగా బయటకు చేర్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కమల్‌భూషణ్, శ్రీనివాసులు, నాయకులు మధు, కాకర్ల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

- ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేయకూడదని సంబంధిత అధికారులను మేయర్ వసీం ఆదేశించారు. గురువారం 48వ డివిజన్‌లో మేయర్ పర్యటించారు. ఎంహెచ్ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి, కార్పొరేటర్లు శ్రీనివాసులు, శేఖర్‌బాబు, టీపీ చంద్రమోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీతో డ్రోన్ పరికరాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ శుభకర్

రాప్తాడు: ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ డ్రోన్ పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ శుభకర్ రైతులకు సూచించారు. గురువారం గాండ్లపర్తి రైతు భరోసా కేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ కిసాన్ డ్రోన్‌కు దరఖాస్తు చేసుకోవాలంటే ఐదుగురు రైతులు గ్రూపుగా ఏర్పాటుకావాలన్నారు. కిసాన్ డ్రోన్ పూర్తి ధర రూ.10 లక్షలు అని, బ్యాంకు రూ.10 లక్షలకు లోన్ ఇస్తున్నట్లు తెలిపారు. ఇందులో గ్రూపు సభ్యులకు ప్రభుత్వం 40 శాతం సబ్సిడీ ఇస్తుందన్నారు. ఐదుగురు గ్రూపు రైతుల్లో ఎవరైనా రైతులు బీఎస్సీ అగ్రికల్చర్, హార్టికల్చర్ డిగ్రీ పూర్తి చేసిన రైతులకు 50 శాతం సబ్సిడీ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచు చంద్రకళ, వైఎస్సార్ సీపీ నాయకులు చిన్న కృష్ణారెడ్డి, ఎంపీఈఓ నలినాక్షి, పంచాయతీ కార్యదర్శి విజయ్, రేఖ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నారాయణ పాఠశాలను సీజ్ చేయాలి

రాప్తాడురూరల్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అనుమతి లేకుండా సీబీఎస్ పేరుతో బ్రాంచ్ నడుపుతున్న నారాయణ పాఠశాలను తక్షణమే సీజ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కేఎస్ఆర్ ప్రభుత్వ బాలికల పాఠశాలలో డీఈఓ సాయిరామ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుల్లాయిస్వామి, చిరంజీవి మాట్లాడుతూ గార్లదిన్నె సమీపంలో ఓ పాఠశాల పేరుతో పర్మిషన్ తీసుకొని అక్కడ నారాయణ విద్యాసంస్థ అని చెబుతూ అడ్మిషన్లు చేస్తున్నారన్నారు. సీబీఎస్సీ పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి రూ.లక్షలు ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. పాఠ్యపుస్తకాల పేరుతో ఒక్కో విద్యార్థి నుంచి రూ.15 వేల వరకు వసూలు చేస్తున్నారన్నారు. ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి రమణయ్య, సహాయ కార్యదర్శులు వంశీ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

'కిమ్స్' సవీరా ఆస్పత్రికి సౌత్‌జోన్ కాహో అవార్డు



అవార్డును అందుకుంటున్న కిమ్స్ సవీరా ఆసుపత్రి సభ్యులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: కిమ్స్ సవీరా ఆస్పత్రికి ప్రతిష్టాత్మక సౌత్ జోన్ ది కన్సార్టియం ఆఫ్ అక్రిడిటెడ్ హెల్త్‌కేర్ ఆర్గనైజేషన్స్ (కాహో) అవార్డు దక్కిందని ఎండీ కిశోర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కాహో ఏడో అంతర్జాతీయ సదస్సు కాహోకాన్ హైదరాబాద్‌లోని నోవోటెల్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగింది. ఫిజికల్ ఆడిట్‌లో 80 శాతం స్కోరు సాధించిన ఆస్పత్రులకు ఏస్ సర్టిఫికెట్ అందిస్తారు. కిమ్స్ సవీరా ఆస్పత్రికి 95 శాతం స్కోరు సాధించి అన్ని విభాగాల్లో అగ్రస్థానంలో నిలిచింది. దీంతో దక్షిణాది ప్రాంతానికి అవార్డు దక్కించుకుంది. దేశంలో ఈ అవార్డు పొందిన 5 ఆస్పత్రుల్లో ఒకటిగా సవీరా ఆస్పత్రి నిలిచింది. కార్యక్రమంలో ఎండీ కిశోర్ రెడ్డి, క్వాలిటీ పేషెంట్ సేఫ్టీ విభాగాధిపతి డాక్టర్ రవిశంకర్, క్వాలిటీ మేనేజర్ ఇమ్రాన్, సీఎస్ఎస్‌డీ ఇన్‌చార్జ్ రామాంజనేయులు పాల్గొన్నారు.